కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గత రెండు రోజుల్లో సుమారు 160 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేయడం జరిగిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం పలువురు లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయటమే కాకుండా వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజలకు ఎమ్మెల్యే ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఎండి ఇబ్రహీం, కాశీనాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ సబిహాబేగం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. న్యూ అల్లాపూర్ మహబూబ్ ఫంక్షన్ హాల్ పక్క వీధిలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధునాతన వసతులతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో అల్లాపూర్ డివిజన్‌ను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ రావు, మహ్మద్ ఇస్మాయిల్, నసీర్, మహ్మద్ నూర్ ఖాన్, ఖదీర్, యోగిరాజు, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



బాలానగర్‌లో....



హెచ్ఏఎల్‌లో...



వివేకానందనగర్‌లో...

కూకట్‌పల్లి (జోన్‌బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో గురువారం సామాజికతత్వ వేత్త, ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం, మహిళా విద్య కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. భారతదేశంలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన జ్యోతిబా పూలే దంపతులన్నారు. నేటి తరం జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

రసాయన శాస్త్రంలో కొత్త పరిశోధనలు అవసరం

జేఎన్‌టియుహెచ్‌లో 'రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ కెమికల్ సైన్సెస్' సదస్సు



రమాదేవి దంపతులను సన్మానిస్తున్న డా. కె. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డా. కె. వెంకటేశ్వరరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న కాలుష్యం, వాతావరణ మార్పులు, వనరుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు రసాయన శాస్త్రంలో కొత్త పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయుహెచ్ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ కెమికల్ సైన్సెస్' సదస్సుకు విజయకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి. రమాదేవి పదవీ విరమణ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో దేశం నలుమూలల నుంచి 100పైగా సందేశాలు అందగా అందులో నుంచి 30 మౌఖిక ప్రదర్శనలు, 25 పోస్టర్ ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ సుస్థిరత అనేది ఒక పదం మాత్రమే కాదని భవిష్యత్తు ఆవిష్కరణలకు ఆవశ్యకమైన దారి వంటిదని తెలి పారు. నిత్యం మనం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు కెమిస్ట్రీ రంగంలో కొత్త పద్ధతులను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రమాదేవి అందించిన సేవలు మరవలేనివన్నారు. ఐఐటీ మద్రాస్ డాక్టర్ రమేష్ లక్ష్మీనారాయణ గార్డాస్ మాట్లాడుతూ విద్యారంగంలో ఆధునికతకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని, ఆలోచనల మార్పిడి, పరిచయాల నిర్మాణం వంటి వాటితో ఆధునికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు అపర్ణ, సబిత కళ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దీక్షా దివస్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న దీక్షాదివస్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్, మల్కాజ్‌గిరి బీఆర్‌యస్ పార్టీ కార్యాలయం దుండిగల్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు బీఆర్‌యస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా తెలిపారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గ అన్ని డివిజన్ల బీఆర్‌యస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

మోతీనగర్: రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం కోరారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ చేపట్టిన దీక్ష రోజును గుర్తు చేసుకుంటూ అల్లాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దుండిగల్‌లోని బీఆర్‌యస్ పార్టీ కార్యాలయంలో 29 తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే దీక్ష-దివస్ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- పలు కాలనీల్లో విచ్చలవిడిగా సంచారం
- పగలు, రాత్రి తేడా లేకుండా దాడులు



పలు కాలనీ వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



మోతీనగర్: గ్రామ సింహాలు రాత్రి పగలు తేడా లేకుండా వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్, అవంతినగర్, పాండురంగ నగర్, కబీర్‌నగర్ స్నేహపురి కాలనీ, బాలాజీ స్వర్ణపురి కాలనీతో పాటు పలు బస్తీ, కాలనీల్లో గ్రామ సింహాల బెడద తీవ్రంగా మారింది. అదే విధంగా అల్లాపూర్‌లోని వి.రామారావునగర్, న్యూ రామారావునగర్, శివ బస్తీ, శివాజీనగర్, రాధాకృష్ణనగర్, రాజీవ్‌గాంధీ నగర్, యూసుఫ్‌నగర్ గ్రామ శివారు కాలనీ వాసులపై దాడులు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. పలు కాలనీల్లో ఉన్న మటన్, చికెన్ షాపులు, హోటల్‌ల వద్ద తిష్ట వేసి అటుగా వచ్చే వారిపై దాడులకు దిగుతున్నాయి. అంతేకాకుండా వాహనాలపై వెళుతున్న వారిపై వెంటపడుతూ దాడులు చేయడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో సంబంధిత అధికారులు ఊర కుక్కలను తీసుకువెళ్లి సుదూర ప్రాంతాల్లో వదిలిపెట్టేవారు. ప్రస్తుతం అలా కాకుండా గ్రామ సింహాలను పట్టుకొని ఆపరేషన్ చేసిన అనంతరం ఎక్కడ నుంచి తీసుకెళ్లారో అక్కడే వదిలేస్తున్నారు. దీంతో కుక్కల సంఖ్య పెరిగి గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కాలనీ వాసులు బయటకు రావాలంటే జంకుతున్నారు. సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్తీ, కాలనీలో విచ్చలవిడిగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్న గ్రామ సింహాలను తరలించాలని కోరుతున్నారు.

పబ్లిక్ టాయిలెట్‌ను తరలించాలి



పాఠశాల ప్రహరీ గోడ పక్కనే ఉన్న పబ్లిక్ టాయిలెట్

మూసాపేట: మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే దారిలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం ఏర్పాటు ఇక్కడ దీనిని చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో కొన్ని రోజుల క్రితం దీనిని మూసివేసి చుట్టూ మొక్కలు ఏర్పాటు చేశారు. అయితే పబ్లిక్ టాయిలెట్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ పక్కనే ఉండటంతో పాఠశాల తరగతి గదులకు దుర్వాసన వస్తూ విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో కిటికీలు మూసుకుని పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. మొక్కలు ఎన్ని అడ్డుపెట్టినా సెలవుల సమయంలో కొందరు ఇక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా దీనిని ఇక్కడ నుంచి మరో చోటుకు తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌టీసీ డిపోలో వన భోజనాలు



కార్యక్రమంలో కవిత, డిపో మేనేజర్ హరి తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపోలో గురువారం కార్తీకమాస వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజనల్ మేనేజర్ కవిత పాల్గొని ఉద్యోగస్తులతో సరదాగా గడిపారు. అదే విధంగా ఉద్యోగస్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడిన అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ ఇంజనీర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీకి చెందిన శివరాజ్ గౌడ్ నివాసంలో అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, ప్రదీప్ రెడ్డి, రామరాజు, దయాసాగర్, పరమేష్, గోపాల్‌రావు, నవీన్ రావు, భారత్ గౌడ్, రవి, పృథ్వీ, శివ తదితరులు పాల్గొన్నారు.